

# తప్పటడుగు

శ్రీకంఠమూర్తి

"సాయంకాలం ఆరుగంటలయిందేమో, చీకటి మెల్లమెల్లగా తన రాజ్యాన్ని స్థాపించబోతున్నది. భాస్కరుని బంగారు కిరణాలు ఇంకా చెట్ల మీదినుంచి పూర్తిగా నిష్క్రమించలేదు. కిలాకిలారావాలు చేసే పక్షులు ఇంకా గూళ్ళకు చేరుకోలేదు. అయినా నా గదిలో మాత్రం చీకటి దొంగలా ప్రవేశించి గదంతా వ్యాపించసాగింది. పడమటివైపువున్న కిటికీ గనుక తెరవకపోయివుంటే ఈ పాటికి గదంతా గాఢాంధకారంలో వుండేది. ఆ మసక వెలుతురులో కిటికీలోనుంచి చూస్తుంటే పక్కనున్న పెద్దయిల్లు ఒక రాకాసిలావున్నట్లు కనిపించింది.

అంతలో అమ్మ హరికేన్ లాంతరు తెచ్చి గదిలో పెట్టిపోయింది. ఆ రోజు ఉదయంనుండీ నాకూ, అమ్మకూ ఒళ్ళుహూనమయ్యేలా పని తగిలింది. ఇల్లూ, పెరడూ బాగుచేయటమే సరిపోయింది మాకిద్దరికీ.

ఆ రోజు ఉదయమే ఆ ఊళ్ళో దిగి ఆ ఇంట్లోకి ప్రవేశించాం మేం. కొత్తగా బదిలీ అయి వచ్చిన మేష్టార్ని కావడం వల్ల, ఆ ఊళ్లో నాకు పరిచయస్తులెవరూ లేకపోవడంవల్ల, పాత మేష్టారే మాకు ఆ ఇల్లు కుదిర్చిపెట్టారు. నేను ఉద్యోగంలో చేరిన ఈ రెండేళ్ళలోనూ ఎన్నో ఊళ్ళు బదిలీ చేశారు నన్ను. అవన్నీ చిన్న-చిన్న పల్లెటూళ్ళే. అలాంటిచోట్ల హోటళ్లుండవు కనుక మా అమ్మ నాతోనే వచ్చి వుంటూ నాకు వండిపెట్టేది.

మేము దిగిన ఇల్లు బాగా కలిగివున్న ఆసామిది. ఆయన పట్నంలో ఏదో ఉద్యోగం చేస్తూంటాడట. ఇంటితోపాటు కాస్త పొలం కూడా ఆ వూళ్ళో వుందిట అతనికి. ఎప్పుడో ఆర్నెల్లకో, సంవత్సరానికో ఓసారి వచ్చి, తన ఇంటినీ, పొలాన్నీ చూసిపోతుంటాడంటారు. ఆ ఇంటి తాళంచెవి ఇచ్చిన కరణంగారు ఆ ఇంటికి అద్దె ఏమీ చెల్లించనవసరంలేదనీ, ఏళ్ళతరబడీ మూసివుంచిన తలుపులు తెరుచుకుని ఇంట్లో దీపం వెలిగించుకుంటే చాలనీ అన్నారు.

చూస్తూ చూస్తూండగానే బయట బాగా చీకటి పడిపోయింది: ఆ పక్కింటి వైపునుండి ఏమిటో దుర్గంధం వస్తోంది, ఇంతటి నిశ్శబ్దమైన పరిసరాలలో నే నిదివరకెన్నడూ వుండలేదు.

అమ్మ భోజనానికి పిలిచింది. పొద్దుపోవడం కోసం అమ్మతో అవీ ఇవీ మాట్లాడుతూ భోజనం ముగించాను. చెయ్యి కడుక్కొని బయటిగదిలోకి వచ్చాను. కిటికీవైపు చూసేసరికి ఆ పెద్దయింట్లోంచి వెలుగు కనిపించింది. "హమ్మయ్య! పరవాలేదు ఇక్కడకూడా మనుషులున్నారు." అని సమాధానపరచుకున్నాను. చల్లటిగాలి ఆ కిటికీలోంచి వచ్చేసరికి శరీరానికి ఎంతో హాయనిపించింది.

అంతలో ఆ ఇంట్లోంచి ఎవరో ఏడుస్తున్నట్లు వినిపించింది. వెంటనే ఎవరో కొడుతున్నట్లు దెబ్బల చప్పుడు.

టార్చి తీసుకుని, అమ్మతో, ఇప్పుడే వస్తానని చెప్పి బయటికి నడిచాను. పక్కింటి తలుపులు దగ్గరగా వేసివున్నాయి. లోపల్నించి "తిను...... తిను! ఇంకా ఎంత తింటావో తిను!" అని ఎవరో గట్టిగా కేకలు పెడుతున్నారు. ఏడుస్తున్నగొంతు అంత పసివాళ్ళది కాదనిమాత్రం గ్రహించగలిగాను, మళ్ళీ "దట్ దట్" మంటూ దెబ్బలపడ్డాయి. నేనిహ వినలేక గబ గబా తలుపు నెట్టుకుని లోపలకు దూరాను. అలా పరాయి వాళ్ళింట్లోకి అనుమతిలేకుండా ప్రవేశించడం తప్పన్న సంగతికూడా నా తప్పట్లో గుర్తుకు రాలేదు.

నన్ను చూడగానే కొడుతున్న చెయ్యి ఆగిపోయింది. ఆ చెయ్యి తాలూకు స్త్రీ నా రాకతో ఏం చేయడానికి తోచనట్టు నిలబడిపోయింది. ఇద్దరు చిన్నపిల్లలు అన్నం తింటున్నారు. మరో అమ్మాయి నేలమీద అస్తవ్యస్తంగా పడి వుంది. ఆ అమ్మాయికి పదారేళ్లుంటాయేమో! నన్ను చూడగానే ఆ అమ్మాయి వెంటనే లేచి కూర్చుని పరికిణీ సరిచేసుకుంది. నిటారుగా చాపుకునివున్న కాలిని చేత్తో దగ్గరకు లాక్కుంది.

"ఏం జరిగింది?" అని అడిగాను.

ఆవిడ చేతిలోవున్న కర్ర కిందపడేసి విసుగ్గా అంది.

"ఎప్పుడూ తిండి రంధేనండీ దీనికి. ఎంత పెట్టినా చాలదు. ఇంకా పెట్టమంటుంది. కాళ్లేని కుంటిది. పొట్టపగిలేటట్టు తిని ఇంట్లోనే గలీజు చేస్తే ఇంత పెద్దపిల్లకు సేవచేయడానికి నాకు అసహ్యం వేయదా మీరే చెప్పండి..."

"కాలు కుంటా?" నమ్మలేనట్లు అడిగాను. ఆ అమ్మాయి మొహంమాత్రం చాలా అందంగా వుంది.

"ఇదుగో చూడండి. లేచి నిలబడలేదు. అమ్మా, నాన్నలను మింగి ఇహ నన్నుకూడా మింగడానికోసం ఇంకాబతికుంది ఈ దెయ్యం" అంటూ మెటికలు విరిచింది.

నాకు తెలియకుండానే ఆ అమ్మాయి మొహం మీద టార్చివేశాను. సూటిగా పడిన వెలుగును భరించలేక కళ్ళు మూసుకుందామె. ఆ మొహంనిండా కళ్ళే ప్రధానంగా కనిపిస్తున్నాయి. విశాలమైన కళ్ళు. గుండ్రని మొహం, ఉంగరాలుతిరిగి, నల్లగా నిగనిగలాడుతున్నజుట్టు, చక్కనిముక్కు మొత్తంమీద ఆ అమ్మాయి అందగత్తే అని చెప్పాలి.

టార్చి తీసేసి అన్నాను ఆమెతో. "మంచి అమ్మాయివికదూ నువ్వు. అలాచెయ్యొచ్చా?"

ఆమె చాలా దీనంగాచూసింది నావైపు. మళ్ళీ రెండుచేతుల్లోనూ మొహందాచుకుంటూ "నేనేం చెయ్యను? నాకు చాలా ఆకలిగా వుంటుంది" అంది.

ఏం సమాధానం చెప్పాలో తోచక వెనక్కు తిరిగాను. ఆ పెద్దావిడ మాత్రం ఇంకా రుసరుసలాడుతూనే వుంది.

ఇంటికి రాగానే అమ్మ ఏం జరిగిందని అడిగింది. ఏమీలేదులే! అనేసి పక్కమీద ఒరిగాను. ఆ అమ్మాయి గురించే ఆలోచిస్తూండడం చేత ఎప్పుడు నిద్రపట్టిందో నాకే తెలియదు.

మర్నాడు ఉదయం బడికి బయలుదేరాను. మా ఇంటినుంచి బడి కొంచెం దూరమే అయినా నడిచివెళ్ళక తప్పదు. పక్కింటి ముందునుంచి నడుస్తున్నప్పుడు అప్రయత్నంగా నా దృష్టి ఆ ఇంటి కిటికీవైపు మరలింది. కిటికీఊచలు పట్టుకుని ఆ కుంటి అమ్మాయి కూర్చుని వుంది.

"ఏం చేస్తున్నావమ్మాయ్?" అనిఅడిగాను.

"నా పేరు శాంత."

"నేను నీపేరడగలేదు. కాని బాగుంది."

"బడికెళుతున్నారా?"

"అవును. నీకు చదవడం వచ్చా?"

"ఊహుఁ ...మీరు నేర్పిస్తారా?"

"ఆఁ...నేర్పించగలను కాని నీకు నిలబడడం చేతకాదుగా?"

ఊహుఁ ...నాకు చేతకాదు."

"నేను ఊతకర్రలు చేసిపెడతాను. నిలబడడానికి, నడవడానికి ప్రయత్నిస్తావా?"


"అలాగే"

"అలవాటయితే అదే వస్తుందిలే! నెమ్మదిగా అలవాటు చేసుకో" అని నేను బడికి వెళ్ళిపోయాను.

రోజూ ఆ అమ్మాయి కిటికీలో కూర్చునుండేది. నేను వెళ్ళే సమయానికి. ఒకవేళ నేను పలకరించకపోయినా తానే పలకరించి మాట్లాడేది. ఆమె గొంతు ఎంతో మృదువుగానూ, తీయగానూ వుండేది. ఎదుటివాళ్ళను ఆకర్షించి నిలబెట్టి వినేటట్టు చేసే మాధుర్యం వుంది ఆ గొంతులో. అయితే నేమి, నాలుగు రోజులకో సారి ఆమె దెబ్బలు తినడమూ, కేకలు పెట్టడమూ తప్పడం లేదు. అలాంటప్పుడు నేను వాళ్ళింటి చాయలకు కూడా వెళ్ళేవాడిని కాను. వాళ్ళ స్వంత విషయాల్లో జోక్యం చేసుకోవడం భావ్యం కాదని తోచింది నాకు.

ఆ రోజు శనివారం కావడంవల్ల మధ్యాహ్నమే ఇంటికి తిరిగి వస్తున్నాను. నాలుగు రోజులు వరుసగా వాన కురిసి ఆ రోజే వెలిసింది. బాగా ఎండ కాస్తోంది. ఎప్పటిలా శాంత కిటికీలో కూర్చుని వుంది.

'శాంతా, ఆ కిటికీలో కూర్చునేకంటె, కాస్త బయటికి వచ్చి కూచోకూడదూ!' అన్నాను.



అనురాగం చిత్రం : అనంతసత్య, బిలాస్‌పూర్

## తప్పటడుగు

'మరి నాకు నడవటం రాదే? మీరు నేర్పిస్తారా?'

'ఓ...నేర్పిస్తాను.'

"ఇవ్వాళ సాయంత్రమే మొదలుపెట్టాలి."

"చూద్దాం"

"చూద్దామంటె కాదు తప్పకుండా నేర్పించాలి"

"మరి మీ పిన్ని......"

"మా పిన్నె తిడుతుంది నన్ను రోజూ. నడవడం నేర్చుకుని దొడ్డమ్మగారి దగ్గరకన్నా తిరగలదాదూ? అని. దొడ్డమ్మగారంటే మీ అమ్మగారన్నమాట!" అంది శాంత

"అయితే సాయంకాలం చూద్దాంలే!" అనేసి ఇంటికి వచ్చేశాను.

ఆ రోజు సాయంకాలం రెండు కర్రలు తయారుచేసి శాంతదగ్గరకు పట్టుకెళ్ళాను. గుమ్మం దగ్గరే ఎదురైన శాంత వాళ్ళపిన్ని "అవేమిటండీ?" అంది నా చేతిలోని కర్రలను చూస్తూ.

"శాంతకు నడక నేర్పిద్దామని..." నసిగాను నేను.

ఆవిడ కృతజ్ఞతాపూర్వకంగా చూసింది నా వైపు.

"అంత మాత్రం పుణ్యం కట్టుకోండి బాబూ. మీ మేలు జన్మలో మరచిపోను. దానికి కూచున్నచోట చాకిరి చేసి చేసి ప్రాణం విసిగి పోయింది నాక్కూడా!" అంది.

నేను లోపలికి వెళ్ళబోయాను. కాని ఆవిడే మళ్ళీ నన్ను ఆపి "అది భలే పెంకిది. మొండి పట్టెక్కువ దానికి. నడవడం నేర్చుకోదు. తన పని తాను చేసుకోవడమూ నేర్చుకోదు. కూర్చున్నచోటే రోజుల తరబడి కూచోవడం పీకలదాకా మెక్కడం. ఉన్నచోటే గలీజు చెయ్యడం. అంతే తెలుసు దానికి" ఆవిడ ఇంకా ఏమిటేమిటో చెబుతూనే వుంది. కాని నేను వినిపించుకోకుండా లోపలికి వెళ్ళిపోయాను.

శాంతను చెయ్యి పట్టుకుని లేవదీశాను. ఆమె కాళ్ళు ఎంతప్రయత్నించినా నిటారుగా నిలబడటం లేదు కాళ్ళల్లో పట్టులేకపోవడంతో ఆమె కింద పడబోయింది. అంతలో నేను జాగ్రత్తగా పట్టుకుని ఆమె బరువంతా నామీద వేసుకుని, బలవంతంగా నిలబెట్టి, కర్రలు చేతికిచ్చాను. రెండు భుజాలూ నేను పట్టుకుని నడిపించగా నెమ్మదిగా ఒక్కొక్క అడుగే వేయసాగింది శాంత. ఎలాగయితేనేం మా ఇంటిదాకా నడిపించుకు రాగలిగాను. ఉయ్యాలబల్లమీద కూర్చోపెట్టి అమ్మతో శాంతను తీసుకొచ్చిన సంగతి చెప్పాను. అమ్మ ఆమెను చూసి ఎంతో జాలి పడింది. తల్లి-తండ్రులను పోగొట్టుకోవడం కాకుండా ఈ అవిటితనంకూడా ఎందుకు పెట్టాడో భగవంతుడు? అని విచారించింది.

కాసేపు అవీ ఇవీ మాట్లాడి ప్లేటులో టిఫిన్ తెచ్చి పెట్టింది అమ్మ. కాని శాంత మొహమాట పడి అది తీసుకోనేలేదు.

ఇప్పుడు పలకా బలపం ఇస్తాను. అక్షరాలు నేర్చుకుంటావా? లేక మంకుతనం చేస్తావా?" అని అడిగాను.

"నేనేమీ అలాంటిదాన్ని కాను" సిగ్గుపడుతూ అంది

నా కాశ్చర్యం వేయసాగింది ఆమెను చూస్తూంటే, వాళ్ళింట్లో అంత పెంకిగా వుండే శాంత ఈమేనా అనుకున్నాను.

ఓ గంటసేపు కూర్చోబెట్టుకుని తరువాత మళ్ళీవెళ్ళి వాళ్ళింట్లో దింపివచ్చాను.

అలా రోజూ కాసేపు తీసుకొచ్చి అక్షరాలు నేర్పించడంతో ఇటు చదువూ, అటు నడకా— రెండూ అలవాటు కాసాగాయి ఆమెకు.

* * *

రెండేళ్ళు గడచిపోయాయి. ఆ ఊరికి మేము పాతబడిపోయాము. ట్రాన్స్ఫర్ కోసం ఎంత మొరపెట్టుకున్నా వినేవాళ్ళే లేకపోయారు విద్యాశాఖలో. ఊళ్ళో అందరూ నన్నూ ఎంతో గౌరవంగా చూసేవారు. ఊళ్లో రాజకీయపు గొడవలు ఎక్కువగా లేకపోవడంతో హాయిగా, ప్రశాంతంగానే వుండేది. పిల్లలుకూడా శ్రద్ధగా బడికివచ్చి బుద్ధిగా చదువుకునేవారు. అయినా ఎందుకో నాకక్కడ తృప్తిగా వుండేదికాదు. నా ఆశయాలు ఎప్పుడు ఫలిస్తాయోనని ఎదురుచూస్తూ రోజులు నెట్టుకొస్తున్నాను.

శాంత మాత్రం రోజూ మా యింటికి వస్తూండేది. ఇప్పుడెవరి ఆధారమూ లేకుండా నడవగలదు కాని, నెమ్మదిగా ఒక్కొక్క అడుగే వేస్తూ నడిచేది. అంతకన్న ఆమె అభివృద్ధి సాధించలేదని నాకుతెలిసిపోయింది. కాని చదువుమాత్రం బాగా అబ్బింది. అయితేనేం, ఇంట్లో నాలుగు రోజులకోసారి పెద్దగా రాగం తీసి ఏడవడం, దెబ్బలు తినడం— ఇవిమాత్రం మానలేదు. అసలందువల్లే ఆమె పెరుగుదలకూడా ఆగిపోయిందేమో అనిపించేది నాకు. మొహం పెద్దగా వయసుకు తగ్గట్టుగావున్నా ఒళ్ళంతా సన్నాగావుండి ఇంకా చిన్నపిల్లలాగానే కనిపించేది. "పదహారు పదిహేడేళ్ళ పిల్ల ఇలాగేనా వుండడం!" అని అమ్మకూడా ఆశ్చర్యపడేది.

ఆమెకొక అన్నయ్యకూడా వున్నాడట. తల్లిదండ్రులు పోగానే పట్నం పారిపోయి ఏవేవో చిన్నచిన్న ఉద్యోగాలు చేశాడట. కుదురుగా ఏ ఉద్యోగంలోనూ వుండకపోవడంచేత నెలనెలకు సరిగ్గా డబ్బు పంపడట. ఎప్పుడో తోచినప్పుడు పంపిస్తూంటాడట. అప్పుడప్పుడూ అంటే రెండేళ్ళకో లేక మూడేళ్ళకో ఒకసారివచ్చి చెల్లెల్ని చూసిపోతుంటాడట. అయితే ఒక్కపని మాత్రం అతను మర్చిపోకుండా చేస్తాడట. అదేమిటంటే సంవత్సరానికొకసారి చెల్లిలికి బట్టలు కొని పంపడం. పిన్ని బాబాయి తిట్టుకుంటూ తిండి పెట్టగలరు కాని, బట్టలు మాత్రం కుట్టించరని అతనికి తెలుసట. ఇవన్నీ ఆమె చెప్పింది. తనకి వ్రాయడం వచ్చినప్పటినుంచీ తనే వ్రాస్తోందిట ఉత్తరాలు. మొన్ననేఆమె వ్రాసిన ఉత్తరానికి జవాబుతో బాటు రెండు చీరెలు కూడా పంపించాడు వాళ్ళన్నయ్య. ఆ ఉత్తరం తీసుకొచ్చి నాకు చూపించింది శాంత. త్వరలోనే తనకు మంచి ఉద్యోగం దొరకబోతోందనీ అది దొరకగానే తను వచ్చి చెల్లాయిని తీసుకెళ్ళి తన దగ్గరే అట్టిపెట్టుకుంటాననీ, మంచి డాక్టరుకు చూపించి కాలు బాగు చేయిస్తాననీ వ్రాశాడు. కాలు బాగయితే పెండ్లి కూడా చేస్తాడట!

నేను ఉత్తరం చదివేదాకా మౌనంగా వుండి తరువాత అడిగింది శాంత. "ఇవన్నీ సాధ్యమవుతాయా మేష్టారూ?" అని.

"ఏవన్నీ...?"


## కాయకల్ప చికిత్స

★

హృదయము పూపిరి తిత్తులు. పైత్యకోశము పూర్తిగా శిథిలము రోగి తిరిగేస్థితిలోవుంటే ఈచికిత్స పొందవచ్చును 3లేక 4మాసములలో ఈచికిత్సవల్ల దేహములోవున్న అన్ని వ్యాధులు నివారణమగుటయేగాక సగము వయస్సు కలిసివచ్చును. అనగా 60 సంవత్సరములవారు ఈ చికిత్స పొందిన 30 సంవత్సరముల ప్రాయములో వారికివున్న యవ్వనము కలుగును. ఇంగ్లీషు ఆయుర్వేద యునాని హోమియోపతి ప్రకృతి వైద్యములవల్ల సాధ్యముకాని అన్ని వ్యాధులు నివారణమగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రు 1—50 M. O. పంపవలయును.

★

శ్రీ యోగాశ్రమము

పెదవాల్తేరు,

విశాఖపట్టణము-3

"నాకు కాళ్ళు బాగవటం, పెళ్ళి కావటం. పాప..."

నాకు నవ్వు వచ్చేది. నా నవ్వుచూసి సిగ్గుపడిపోయింది కాంత.

ఇంత చక్కగా మాట్లాడే కాంత తనకు పట్టుదల కలిగినప్పుడు మాత్రం సర్వం మరచిపోయేది.

ఆ విషయమై నేను అడిగినప్పుడు అనేది. "నేనేం చేసేది మేష్టారూ...నాకు పట్టుదల కలిగినప్పుడు ఒంటిమీద తెలివే వుండదు. నేనేం చేస్తున్నానో నాకే తెలియదు. నా మీద నాకే కోపంగా వుంటుంది. అలాంటప్పుడు...'

ఒకసారి కాంత పినతల్లి తమ్ముడు వచ్చాడు వాళ్ళింటికి. ఆ రోజు రాత్రి చాలా పెద్ద గొడవ జరిగింది వాళ్ళింట్లో. పరాయివాళ్ళ గొడవల్లో తలదూర్చడం ఇష్టం లేకపోయినా, కాంత ఒంటిమీద పడుతున్న దెబ్బలు నన్ను ఇంట్లో వుంగ నీయలేదు.

నేను వెళ్ళేసరికి అతను కర్రతో కాంతను ఇష్టం వచ్చినట్టు బాదుతున్నాడు. నేను వెళ్ళి గబుక్కున అతని చేతిలోని కర్రను లాక్కున్నాను.

అడ్డదిడ్డంగా పడివున్న కాంత ఏడుస్తోంది. నేను వెళ్ళగానే లేచి కూర్చుంది.

'ఏమయింది కాంతా...' అని అడిగాను.

కాంత మాట్లాడకుండా అతనివైపు చూపించింది.

ఎర్రటి కళ్ళతో. నిక్కబొడుచుకున్న పొట్టి జుట్టుతో. ఇనపముక్కల్లాంటి నల్లటి చేతులూ, కాళ్ళతో వున్న అతను చూడడానికి రాక్షసుడల్లే కనిపించాడు నాకు.

"ఏయ్ మిష్టర్, ఏమిటిది దౌర్జన్యం?" అన్నానులేని ధైర్యం తెచ్చుకుని.

"మా ఇంటికి రాక్షసిలా దాపురించింది సార్ ఇది. ఎప్పుడూ 'తిండో...తిండో' అని చచ్చిపోతుంది. మా అక్కయ్యమాత్రం ఎంతవరకూ పెట్టగలదు మీరే చెప్పండి..చస్తేనన్నా బాగుణ్ను పీడా వదిలేది." కోపంగా కాంతవైపు ఉరిమి చూస్తూ అన్నాడతను.

కాంతను చూస్తూంటే జాలిగానూ, అతని మాటలు వింటూంటే నవ్వుగానూ వుంది నాకు.

తను చేస్తున్నదీ అదేనని, ఇంట్లో వూరికే కూర్చుని తింటూ, ఏమీ తోచనప్పుడు అక్క ఇంటికివచ్చి అధికారం చెలాయించడం.

"అలా ఎలా చచ్చిపోగలదండీ!" అన్నాను సౌమ్యంగానే.

"మరి బ్రతికుండిమాత్రం చేసేదేముంది తినడంతప్ప?" హేళనగా అన్నాడు.

"తినడం తప్పదుగా! ప్రాణాలున్నంతవరకూ ఆకలనేది వుంటుంది." అనేసి ఇహ అతనితో ఎక్కువ వాదించడం ఇష్టంలేక ఇంటికి వచ్చేశాను.

మా ఇంటికి వచ్చినప్పుడు కాంత ఎంతో బుద్ధిగా వుంటుంది. ఎంతోవినయంగా మాట్లాడుతుంది. తినడానికి ఏమిపెట్టినా తీసుకోదు. మా అమ్మ కయితే ఆమె మరీ నచ్చింది. ఊరినుంచి మా అక్కయ్యా, పిల్లలూ వచ్చారు సెలవలకు. కాంత మా యింటికి రావడం మరీ ఎక్కువయిందప్పుడు. ఎప్పుడూ అక్కయ్యతో కబుర్లుచెబుతూ పిల్లల్నిఆడిస్తూ కూర్చునేది.

ఒకరోజు నేను బడినుండి ఇంటికివచ్చేటప్పటికి నాకో దృశ్యం కంటబడింది. అమ్మా, అక్కయ్యా వంటింట్లో పని చేసుకుంటున్నారు కాబోలు. కాంత ఒక్కర్తీ ముందుగదిలో కూర్చునివుంది. అక్కయ్య పిల్లల్లో ఆఖరివాడయిన ఆరునెలల బాబును రెండు చేతులతోనూ గుండెల కదిమి పట్టుకుని, కళ్ళుమూసుకొని తన్మయత ననుభవిస్తోంది. నాకది వింతగా తోచి "కాంతా" అని కేకేశాను మామూలుగా. కాని ఆమెమాత్రం ఆ పిలుపు విని ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. నన్నుచూడగానే సిగ్గుపడి బాబును క్రింద పడుకోబెట్టేసింది. నా కెందుకో ఆమె చాలా పెద్దదయిపోయినట్టు తోచిందా క్షణాలలో. ఆమె వెంటనే కర్రలు తీసుకుని ఇంటికి బయలుదేరింది. కాని చీర కర్రకు తగులుకోవడంతో ధబేలుమని క్రింద పడిపోయింది. ఆమెను పట్టుకుని లేవదీయా లనిపించలేదు నాకు. ఎంత కుంటిదయినా ఆమె వయసులో వున్న పిల్లగదా?

నేను అక్కయ్యను కేకేసి ఆమెను లేవదీయమని చెప్పాను. అప్పటినుంచీ ఆమె మా ఇంటికి రావడం తగ్గిపోయింది. ఎప్పుడో వారానికో, పది రోజులకో నేను లేనప్పుడువచ్చి వెళుతూండేదిట. ఒకసారి అక్కయ్య అంది నాతో. "పాపం! కాంత చాలా మంచిపిల్లరా...కాని అవిటితనం మూలంగా ఆమె జీవితం నాశనమయిపోయింది..." అని.

"మొదట్లోనే డాక్టరుకు చూపించివుంటె మరీ ఇంత అన్యాయమయ్యేది కాదక్కయ్యా, అసలు మేమీ ఇంటికి వచ్చినప్పుడు చూడాల్సింది నువ్వు ఎంత అసహ్యంగా చేసుకునేదో తనచుట్టూ. నేను కాస్త నడవడం నేర్పించి, చదువు చెప్పినందువల్ల ఈమాత్రంగానైనా వుంది" అన్నాను.

అక్కయ్య కాంతకు జాకెట్లు కుట్టి పెట్టింది. చక్కగా జడేసుకుని శుభ్రంగా వుండడం నేర్పింది. మెళ్ళో వేసుకోవడానికి ఒక పూసల దండకూడా ఇచ్చింది.

మా అక్కయ్య వున్నప్పుడే నాకు పెళ్ళి సంబంధంకూడా రావడంతో అక్కయ్య చాలా సంతోషపడి, పెళ్ళిచూపులకు నాతో వచ్చింది. పెళ్ళికూతురుకూడా స్కూలు టీచరేనట. చూడటానికి కాస్త అందంగానే వుండడంతో నేనా అమ్మాయిని వెంటనే ఒప్పేసుకున్నాను. అదీకాక కొన్నాళ్ళల్లో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ రావచ్చునన్న సమాచారంకూడా అందడంవల్ల ఇహ ఆ వూరు వదలి వెళ్ళాల్సిన తరుణం దగ్గరకు వచ్చింది.


ఒకరోజు నేను బడినుండి వస్తూండగా కిటికీలో కూర్చున్న కాంత అడిగింది. "మేష్టారూ... మీకు పెళ్ళటగా?"

"నీకెవరు చెప్పారు" ఎదురుప్రశ్న వేశాను.

"దొడ్డమ్మగారు చెప్పారు. అయితే అందరూ వెళతారన్నమాట." దిగాలుగా అంది.

"నీకాళ్ళు బాగుంటే నిన్నుకూడా తీసికెళ్ళేవాణ్ని పెళ్ళికి."

"అక్కడే కాపురం పెడతారా?"



# తప్పటడుగు

"ఏమో, నాకు ఎక్కడికి బదిలీ అవుతుందో చూసి, ఆ తరువాత ఆలోచించాలి."

"వదిన ఎలా వుంటుంది?"

"బాగానే వుంటుంది."

"అంటే పొడుగ్గా, లావుగా వుంటుందా?

"మధ్యరకంగా వుంటుంది."

"పెళ్ళయితే ... ఆమెకు పాపకూడా పుడుతుందా?" అమాయకంగా చూస్తూ అడిగింది.

ఈ సారి సిగ్గుపడటం నా వంతయింది "ఛీ! పిచ్చిగా వాగకు" అంటూ ఇంటికి వచ్చేశాను.

మేమున్న అంతకాలంలోనూ ఒక్క సారే వచ్చాడు ఇంటి యజమాని.

రాగానే ఇంటిముందున్న పూలమొక్కలనూ, ఇంట్లోని పరిశుభ్రతనూ చూసి ఎంతో మెచ్చుకున్నాడు. మూడు రోజులపాటు మా ఇంట్లోనే వుండి, త్వరలోనే తను రిటైర్ అవబోతున్నాననీ. ఆ తరువాత వచ్చి ఇక్కడే వుంటాననీ. నేను ఏ వూళ్ళో వున్నాసరే తప్పక తన దగ్గరికి వస్తూండాలనీ చెప్పి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

నా పెళ్ళికి ముందే నాకా ఊరునుంచి బదిలీ అయిపోయింది. శాంతకు ఈ సంగతి చెప్పి మా ఇంటికి భోజనానికి పిలిచాను. విస్తరి ముందు కూర్చుని మరీ సంకోచపడిపోయింది. శాంత. అమ్మ ఎంత బలవంతం చేస్తున్నా వినకుండా చాలా కొద్దిగా తిని భోజనం ముగించేసింది ఆమె. "పిన్నిచేత దెబ్బలు తింటూ మరీ మరీ అడిగి వేయించుకునే శాంతేనా ఈమె?" అని తగని ఆశ్చర్యం నాకు. అమ్మ కూడా అలాంటి భావమే వ్యక్తంచేస్తూ నావైపు చూసింది. అన్నం తింటున్నంతసేపూ ఏవేవో కబుర్లు చెబుతూనే వుందామె. ఎంతగా పైకి నవ్వుతున్నా, ఆమెలో మేము వెళ్ళిపోతున్నామన్న దిగులు అంతకంతకూ ఎక్కువవడం నేను గమనిస్తూనే వున్నాను.

"శాంతా...నువ్వు ఇప్పుడు చిన్నపిల్లవుకావు. ఇహ నువ్వు నీ మంకుపట్టును వదిలేయాలి. అనవసరంగా దెబ్బలు తింటే ఏం బాగుంటుంది చెప్పు. అందరిచేతా మంచిపిల్లనిపించుకోవాలి. జాగ్రత్తగా మసులుకోవాలి, తెలిసిందా?" అని హితబోధ చేశాను కాసేపు.

ఆమె అర్థమైందన్నట్టు తలూపి, వస్తున్న ఏడుపును దిగమింగడాని కోసం మంచినీళ్ళ గ్లాసును నోటికడ్డం పెట్టుకుంది.

ఆ ఊరికీ. నాకూ ఋణం తీరిపోయింది ఒక్క శాంతను గురించిన జ్ఞాపకాలుతప్ప ఆ ఊరి ప్రత్యేకత ఏమీలేదు నా జీవితంలో. ఆమె జీవితం సుఖప్రదం కావాలని కోరుకొంటూ ఆ ఊరినుంచి వచ్చేశాను.

నా పెళ్ళయిపోయింది. అదృష్టవశాత్తూ మా ఇద్దరికీ ఒకే ఊరిలో ఉద్యోగాలు చేసే అవకాశం రావడం చాలా గొప్ప విశేషం. అయితేనేం నా జీవితం స్కూల్ మాస్టారు వృత్తికే అంకితమయిపోయింది.

రోజులు హాయిగా వెళ్ళిపోతున్నాయి. మేము వుండి వచ్చిన ఊరునుంచి మా ఇంటి యజమాని రామనాధంగారు అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూనే వుండేవారు. ఆయనకు నా అడ్రెస్సెలా దొరికిందో మరి? ఆయనిప్పుడు రిటైరయిపోయి ఆ వూరొచ్చి ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతూ కాలం గడుపుతున్నాడట. ప్రతి ఉత్తరంలోనూ నన్నుమాత్రం తప్పక రమ్మని వ్రాస్తుంటాడు.

ఆయన మాట కాదనలేక సెలవుకోసం అప్లై చేసుకున్నాను. సెలవు దొరికింది. నేనొక్కణ్ణే ఆ వూరికి ప్రయాణమయ్యాను. కనుచీకటి పడే వేళకు ఆ వూరు చేరుకున్నాను. మేముండి వచ్చిన ఆ పాత ఇల్లు ఇప్పుడు పిల్లలతో సందడిగా వుంది. రామనాథంగారు నన్ను చూసి ఎంతో సంతోషపడ్డారు.

ఆ రోజు రాత్రి వెన్నెల పిండారబోసినట్టుగా పరుచుకుని వుంది అంతటా! మేం మందరం భోజనాలు ముగించి ఇంటిముందు కూర్చుని కబుర్లలో పడ్డాం.

అంతలో వున్నట్టుండి పక్కింట్లోంచి ఏడుపు వినిపించింది. అదిశాంత గొంతే. సందేహంలేదు.

నేను చటుక్కున రామనాథంగారివైపు తిరిగి అడిగాను.

"పక్కింట్లో ఆ అమ్మాయి ఇంకా ఇక్కడే వుందాండీ!" అని.

"ఏమో నాయనా ఎవరికి తెలుసు. అసలు అటువైపు మేమెవ్వరం వెళ్ళం. మూడు నాలుగు రోజులకోసారి ఇలా ఏడుపు వినిపిస్తూనే వుంటుంది. ఎవరో ఆవిడ తమ్ముడట. అతను వచ్చినప్పుడల్లా ఆ అమ్మాయిని చావబాదుతాడని ఎవరో చెప్పుకుంటుంటే విన్నాను." అన్నారాయన.

శాంత ఏడుపూ, ఆక్రందనా వినలేకపోయాను. కర్రతో బాగా కొడుతున్నట్టు దబదబమని చప్పుడు వినిపిస్తోంది.

అప్పటికప్పుడు లేచివెళ్ళి ఆ రాక్షసుడి చేతిలోని కర్రను లాక్కుని. అదే కర్రతో అతన్ని ఒళ్ళంతా హూనమయ్యేలా చితకబాదాలనిపించింది నాకు. కాని అలా చేయలేకపోయాను.

ఎంతో సేపటికి ఆ ఏడుపు ఆగిపోయింది.

మర్నాడు అలా ఐడివైపు వెళ్ళొద్దామని బయలుదేరాను. శాంత ఎప్పటిలా కిటికీలోనే కూర్చునివుంది. నేను ఆగాను. ఆమె కళ్ళతడిగా వుండడం గమనించాను. ఆమె నన్ను చూడగానే ముందుకు జరిగి "ఎప్పుడు వచ్చారు మేష్టారూ?" అని అడిగింది.

నిన్న సాయంకాలం వచ్చానమ్మా. నువ్వెలా వున్నావు?" అని అడిగాను.

"ఏదో వున్నానిలా..." విరక్తిగా సమాధానం చెప్పింది ఆమె.

"ఇప్పుడు బాగా నడవగలుగుతున్నావా"

"లేదు మేష్టారూ..అప్పట్లానే నడుస్తున్నాను.

"మరి చదువో?"

మీరు వెళ్ళినప్పటినుంచీ అదీలేదు."

ఇంకా పెంకితనం మానలేదా?"

ఆమె తలవంచుకుంది.

ఇంకెప్పుడూ అలాచెయ్యను మేష్టారూ..." చాలా మెల్లిగా అంది.

"నిన్నరాత్రి ఎందుకలా ఏడ్చావ్, మళ్ళీ వచ్చాడా మీ పిన్ని తమ్ముడు?"

"అవును"

వాడి"కసలు బుర్రనేది వుందా? మరీ అంతలా కొడతాడేమిటి నిన్ను? వాడు మనిషా. పశువా?"

నాకు చాలాకోపం వచ్చేసింది. ఎంత అణుచుకుందామన్నా ఆవేశం ఆగక నోటికొచ్చినట్లల్లా తిట్టేశాను. లోపలున్నవాళ్ళు వినాలనే ఉద్దేశంతో నేను మరింతగట్టిగా అరిచాను. నా ఉద్దేశం గ్రహించిన దానిలా అంది శాంత:

"ఇంట్లో ఎవరూ లేరు మేష్టారూ..."

"ఆ రాక్షసుడప్పుడే వెళ్ళిపోయాడా?"

"ఎక్కడో బయటికి వెళ్ళాడు. ఇప్పుడొస్తాడేమో!"

"వస్తాడా? అయితేరాని. ఈ సారి వాడుగనుక కర్రతీసినట్టు తెలిసిందా, ఇహ వాడిపని అయిపోయినట్టే! అదేకర్రలాక్కుని చచ్చేదాకా చితకబాదుతాను వాణ్ణి.

నా ఆవేశం చూసి శాంత వణికిపోయింది. కంపిస్తున్న స్వరంతో ప్రాధేయపూర్వకంగా అంది: "వద్దు మేష్టారూ ... వద్దు. అతన్ని కొట్టొద్దు..."

"నిన్ను వాడు గొడ్డును బాదినట్టు బాదుతుంటే చూస్తూ ఊరుకోమంటావా మరి? ఆ క్షణంలో ఆమె నా చెల్లెలే అనిపించింది.

"వద్దు మేష్టారూ...మీ కాళ్ళుపట్టుకుంటాను, ... అతన్ని మాత్రం కొట్టకండి!"

"ఏం? ఎందుకు కొట్టకూడదూ?"

"అతని మూలంగానే నేనిప్పుడు తల్లిని కాబోతున్నాను..."

అంతే! షాక్‌తిన్నవాడిలా అక్కడినుంచి వచ్చేశాను.

